## క్లుప్తంగా

### రైతులకు ఎరువులు అందించేందుకు చర్యలు

**కోవూరు:** జిల్లాలో ఈ సీజన్‌లో రైతులకు ఎరువులు అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు రైల్వే యార్డు నుంచి ఆర్బీకేలకు పంపేందుకు సిద్ధంగా ఉన్న లోడ్ లారీలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రబీ సీజన్లో 3 లక్షల ఎకరాల్లో వరి, 1.50 లక్షల ఎకరాల్లో ఇతర పంటలను రైతులు సాగు చేస్తున్నారన్నారు. దీనికి సంబంధించి ఎరువులు ఎంత అవసరమో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఇప్పటి వరకు జిల్లాకు 49 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చినట్లు తెలిపారు. మరో మూడు నెలల్లో 51 వేలు మెట్రిక్ టన్నులు వచ్చేలా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. ఈ వారంలోగా 10 వేలు మెట్రిక్ టన్నులు రానున్నట్లు చెప్పారు. పడుగుపాడు రైల్వే యార్డులో ఈ కార్యక్రమ ఇన్‌చార్జిగా సహాయ వ్యవసాయ సంచాలకురాలు సుజాతను నియమించామన్నారు. రైతులకు ఈ సీజన్లో కావాల్సిన ఎరువులను అందించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందన్నారు. ప్రధానంగా డెల్టా ప్రాంతమైన కోవూరులో ఎరువులను సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు పంపడం జరిగిందన్నారు. ఇటీవలి కాలంలో పడుగుపాడు యార్డులో ఏర్పడిన పలు సమస్యల కారణంగా ఎరువుల రవాణాలో కొంతమేర అంతరాయం కలిగిందన్నారు. రబీ సీజన్లో రైతులు యూరియా ఎక్కువగా వాడడం వల్ల చీడ పురుగుల ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సిఫార్సు చేసిన మేరకు ఎరువులు వాడుకోవాలన్నారు. అన్ని మండలాల్లో ఉన్న వ్యవసాయాధికారులు వారి పరిధిలో ఉన్న ఆర్బీకేలు, ప్రైవేట్ ఎరువుల డిపోలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. కౌలు రైతులకు బ్యాంక్ రుణాలు కావాలంటే ఆయా గ్రామాల్లోని మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. రైతులు ఈ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ నమోదుకు వ్యవసాయ సహాయకులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు సర్వోజీరావు, ఇందిరావతి, వీఏఓలు పాల్గొన్నారు.

### పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు

**కోవూరు:** 'జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రభుత్వం పేదలకు భరోసా కల్పించింది. ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచారు.' అని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరు మండలం చెర్లోపాళెం గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కేవలం మన రాష్ట్రంలో మాత్రమే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ముంగిటికే వైద్యసేవలు అందించేలా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు ప్రజల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ శ్రీహరి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, డాక్టర్ నిరంజన్ తదితరులు మాట్లాడారు. అనంతరం కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకున్న వారికి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కె.సుశీల, డాక్టర్ వి.ప్రదీప్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, కె.నరసమ్మ, పీహెచ్ఎన్ కె.కృష్ణమ్మ, ఎంపీహెచ్ఎస్ ఇలియాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, పంచాయతీ కార్యదర్శి హేమలత, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆంజనేయస్వామికి విశేష పూజలు

**పొదలకూరు:** పట్టణంలోని మారుతీనగర్ శ్రీవీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి పల్లకి సేవను భక్తిశ్రద్ధలతో జరిపారు.

### ఆర్బీకేల్లో యూరియా పంపిణీ

**కొడవలూరు:** మండలంలోని కమ్మపాళెం, యల్లాయపాళెం ఆర్బీకేల్లో రైతులకు మంగళవారం యూరియా పంపిణీ చేశారు. ఏఓ లక్ష్మి చేతుల మీదుగా యూరియా, డీఏపీ ఎరువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని ఆర్బీకేల్లో యూరియా, డీఏపీలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏలు ఒ.సుజిత్, జి.ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

### ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ

**మనుబోలు:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసిన బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గైడ్ టీచర్ హరికృష్ణ ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు ఎలా వినియోగించాలో వివరించారు. టీచర్లు విద్యార్థులకు నేర్పుతారని ఆయన అన్నారు.

# ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలి

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



సూచనలు చేస్తున్న అనిల్‌కుమార్

**నెల్లూరు(బృందావనం):** పెద్దల పండగ, గొబ్బెమ్మల పండగలకు సంబంధించిన ఏర్పాట్లను అధికార యంత్రాంగ సమన్వయంతో పక్కాగా చేపట్టాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. బోడిగాడితోటలో పెద్దల పండగ, మైపాడు గేట్ సెంటర్‌లో నిర్వహించనున్న తెప్పోత్సవం, పెన్నా తీరంలో గొబ్బెమ్మల పండగకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. అనంతరం తిక్కన పార్కు వద్ద వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దల పండగకు ప్రజలు భారీగా తరలివస్తారని, వీరికి అన్ని వసతులను కల్పించాలని సూచించారు. గొబ్బెమ్మల పండగ సందర్భంగా పెన్నా తీరాన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. దీనికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, అస్మా, జయలక్ష్మి, ఏపీ ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదెల సుధీర్, రంగనాథస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

**నెల్లూరు(బారకాసు):** పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నెల్లూరు నగర నియోజకవర్గానికి సంబంధించి మూలాపేటలోని ఈఎస్సార్ఎం, సంస్కృత, బాలిక పాఠశాలలు, సంతపేటలోని డీఎంహెచ్ఓ కార్యాలయం, మోడల్ హైస్కూల్, జాకీర్‌హుస్సేన్ నగర్‌లోని మున్సిపల్ పాఠశాల తదితరాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అధికారులతో కలసి మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్ల ఏర్పాటు, విద్యుత్ సదుపాయం, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక వీల్ చైర్లు తదితరాలను పర్యవేక్షించాలని సూచించారు.

**రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం**

రాజకీయ పార్టీల నుంచి అందిన అర్జీలు, ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. ఓటర్ల లిస్ట్ డ్రాఫ్ట్ రోల్, రేషనలైజేషన్ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమపద్ధతిలో నమోదు చేసి, క్షేత్రస్థాయిలో బీఎల్వోలు పరిశీలించాలని సూచించారు. ఓటు దరఖాస్తు, మార్పులు, చేర్పులకు సంబంధించిన గడువు ముగిసిన నేపథ్యంలో వివిధ ఫారాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి.. రోజువారీ నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల విభాగాధికారులు దేవీకుమారి, శ్రీనివాసులు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# కనిగిరి రిజర్వాయర్‌లో పూడిక తీయరూ..



**నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట):** కనిగిరి రిజర్వాయర్‌లో పూడిక తీయాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు నగరంలోని జలవనరుల శాఖ కార్యాలయంలో పరిపాలనాధికారి కృష్ణయ్యకు వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రిజర్వాయర్లో పూడిక పేరుకుపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోందని చెప్పారు. పూడికతీత ద్వారా ఆరు టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

### సావిత్రీబాయి పూలే జయంతి నేడు

**నెల్లూరు (వేదాయపాళెం):** తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం నిర్వహించనున్నామని మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరంబాకం చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ బైపాస్ రోడ్డులోని పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పించనున్నామని చెప్పారు. భారీగా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

### అనధికార మద్యం విక్రయాలపై దాడులు

**నెల్లూరు(క్రైమ్):** నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో అనధికార మద్యం విక్రయాలపై చిన్నబజార్ పోలీసులు దాడులు చేసి ఇద్దర్ని అరెస్ట్ చేశారు. వివరాలు.. శివగిరికాలనీకి చెందిన ముత్తు కొంతకాలంగా ఇంటి వద్దే అనధికారికంగా మద్యం విక్రయాలను సాగిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న చిన్నబజార్ ఎస్సై సైదులు తన సిబ్బందితో కలిసి మంగళవారం దాడి చేశారు. విక్రేతను అరెస్ట్ చేసి అతని నుంచి 16 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

• ఇరుగాళమ్మ సంఘం సమీపంలో చిల్లర దుకాణాన్ని నిర్వహిస్తున్న సత్తురాజు అనధికారికంగా మద్యం విక్రయాలను సాగిస్తుండటంతో ఎస్సై దాడి చేశారు. సత్తురాజును అరెస్ట్ చేసి దుకాణంలోని 12 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

### ఆటో కార్మికుల సంక్షేమానికి సీఎం సహకారం

**నెల్లూరు(బృందావనం):** ఆటో కార్మికుల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో సహకారాన్ని అందిస్తున్నారని పలువురు కొనియాడారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నగరంలోని బోసుబొమ్మ సెంటర్‌లో కేక్‌ను కట్ చేసి.. మిఠాయిలను వైఎస్సార్ ఆటో యూనియన్ కార్మికుల ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు సంపతి హనుమంతరావు, కార్పొరేటర్ వేలూరు మహేష్, యూనియన్ అధ్యక్షుడు ఆంథోనీ, సభ్యులు శివ, ధనుంజయ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

### సాగునీటిని పొదుపుగా వాడండి

**కొడవలూరు:** సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు రైతులను కోరారు. కొడవలూరు ఇరిగేషన్ కార్యాలయ ప్రాంగణంలో సాగునీటి వినియోగంపై కొడవలూరు, విడవలూరు మండలాల రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ సోమశిల జలాశయంలో 33.899 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉన్నందున సాగునీటిని పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా చివరి ఆయకట్టు పంట పూర్తయ్యే వరకూ నీటిని అందించగలమని చెప్పారు.

# క్యాలెండర్ల ఆవిష్కరణ





ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్యే అనిల్‌కుమార్

**నెల్లూరు (పొగతోట):** ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ టేబుల్ క్యాలెండర్లను కలెక్టర్ హరినారాయణన్ మంగళవారం ఆవిష్కరించారు. ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మన్నేపల్లి పెంచలరావు, నాయుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు ఆంజనేయవర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు కరుణమ్మ, మధు, కృష్ణంరాజు, కృష్ణకుమార్, సంయుక్త కార్యదర్శి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

**నెల్లూరు(బృందావనం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముస్లిం స్వర్ణకార సంఘ క్యాలెండర్లను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆవిష్కరించారు. నగరంలోని రాజన్న భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్మాయిల్ ఖాద్రీ, సభ్యులు ముసవ్వీర్, అస్లామ్, సందానీబాషా, సుభాని, రషీద్, అంజద్‌బాషా, తానేషా, జాఫర్, అహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



అగ్నికుల క్షత్రియ సంఘ ఆధ్వర్యంలో..

**నెల్లూరు (వేదాయపాళెం):** కామాటివీధిలోని కృష్ణ మందిరంలో అగ్నికుల క్షత్రియ సంఘ జిల్లా క్యాలెండర్లను మున్సిపల్ మాజీ చైర్మన్ వేలూరి దశరథరామయ్య ఆవిష్కరించారు. తొలుత మందిరంలో పూజలు చేశారు. అగ్నికుల క్షత్రియ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, న్యాయవాది కాళహస్తి శరత్చంద్ర, అరుణాచలేశ్వరరావు, నేతలు శివశంకర్, జ్ఞానేంద్ర, నాగార్జున, సెంథిల్‌కుమార్, దుష్యంత్‌కుమార్, శ్రీధర్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘన సన్మానం

**నెల్లూరు(దర్గామిట్ట):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు భారీగా తరలివచ్చారు. దీంతో మంత్రి క్యాంప్ కార్యాలయం మంగళవారం కిక్కిరిసింది. మంత్రిని పలువురు సత్కరించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కోడూరు కమలాకర్‌రెడ్డి, నెల్లూరు పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు.

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో నూతన సంవత్సర శుభాకాంక్షలను పలువురు తెలియజేశారు. ఎమ్మెల్యేను సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం కిలివేటిని విక్రమ్‌రెడ్డి సత్కరించారు.



మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు



మేకపాటి విక్రమ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కిలివేటి

# ఎనర్జీ అసిస్టెంట్ల సమావేశం రేపు

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** నగరంలో గురువారం నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఎనర్జీ అసిస్టెంట్ల సమావేశాన్ని జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ పెంచలప్రసాద్ పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబేషన్‌ను డిక్లేర్ చేసి.. ట్రెజరీల ద్వారా వేతనాలను చెల్లించాలని కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నేతలు రసూల్, సునీల్‌కుమార్, ప్రసన్నకుమార్, కృష్ణ, వేణు, రవీంద్ర, దినేష్, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెంచలప్రసాద్

# డాక్టర్ పద్మావతికి సత్కారం

**నెల్లూరు సిటీ:** డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ పద్మావతిని ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నగరానికి వచ్చిన ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి, ట్రెజరర్ రవీంద్రనాథ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ అహ్మద్‌బాబు, బాలచందర్‌బాబు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



### ఏపీజీబీలో ప్రగతి కుబేర్ పథకం



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

**నెల్లూరు(సెంట్రల్):** ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో ప్రగతి కుబేర్ – 444 నూతన డిపాజిట్ పథకాన్ని ప్రవేశపెట్టామని బ్యాంక్ రీజినల్ మేనేజర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సాధారణ ఖాతాదారులకు 7.5 శాతం.. మహిళలు, సీనియర్ సిటిజన్లకు ఎనిమిది శాతం వడ్డీని అందజేయనున్నామని వివరించారు. రుణాలను సైతం సులభతరంగా జారీ చేయనున్నామని తెలిపారు. చీఫ్ మేనేజర్ ఆంజనేయులు, సీనియర్ మేనేజర్లు శ్రీకాంత్ నెహ్రూ, అజయ్‌సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**నెల్లూరు(దర్గామిట్ట):** నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హరినారాయణన్‌ను ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మందా బాబ్జీ, కార్యదర్శి విడవలూరు శ్రీకాంత్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను త్వరితగతిన భర్తీ చేయాలని కోరారు.

### వ్యక్తిపై దాడి

**నెల్లూరు(క్రైమ్):** బైక్‌ను ఢీకొనడమే కాకుండా ప్రశ్నించిన వ్యక్తిపై నిందితుడు దాడి చేసి గాయపర్చారు. వివరాలు.. ఎన్టీఆర్‌నగర్‌లోని పిండిమిల్లు సమీపంలో సెల్‌ఫోన్ వ్యాపారి శివకుమార్ నివాసం ఉంటున్నారు. బాలాజీనగర్‌లోని చికెన్ స్టాల్‌కు బైక్‌పై సోమవారం ఆయన వెళ్లారు. ఈ క్రమంలో ఏసీనగర్‌లోని మహాలక్ష్మమ్మ గుడి సమీపంలో అతని వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తి బైక్‌తో వేగంగా ఢీకొన్నారు. దీనిపై ప్రశ్నించిన శివకుమార్‌పై దాడి చేసి గాయపర్చారు. గాయపడిన బాధితుడు జీజీహెచ్‌లో చేరారు. అక్కడి నుంచి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### మర్యాదపూర్వకంగా..



**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

• వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివయ్య మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు.

### అనఘాష్టమి వ్రతం రేపు

**నెల్లూరు(బృందావనం):** సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి, కృష్ణయోగ మందిర ప్రాంగణంలో ప్రధాన అనఘాష్టమి వ్రతాన్ని గురువారం నిర్వహించనున్నామని మందిర ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

### రూరల్ సీఐగా సుబ్బారావు

**నెల్లూరు రూరల్:** నెల్లూరు రూరల్ సీఐగా సుబ్బారావును నియమిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. రూరల్ సీఐగా ఉన్న శ్రీనివాసులురెడ్డిని గుంటూరు రేంజ్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈయన స్థానంలో గూడూరు సీఐగా పనిచేస్తున్న సుబ్బారావును నియమించారు. బాధ్యతలను సుబ్బారావు బుధవారం స్వీకరించనున్నారు.

### శాస్త్రోక్తంగా అంకురార్పణ



**నెల్లూరు(బృందావనం):** నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారి నూతన ఉత్సవమూర్తి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని అంకురార్పణను శాస్త్రోక్తంగా మంగళవారం నిర్వహించారు. అభిషేకాలు, కలశస్థాపన, నవగ్రహ మండపారాధన తదితర పూజా కార్యక్రమాలను విశేషంగా జరిపారు. ఉభయకర్తలుగా గ్రోసు సుబ్బారావు, సత్యలక్ష్మి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ జయరామ్, ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి, రాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హుండీ కానుకల లెక్కింపు



**నెల్లూరు రూరల్:** నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. 93 రోజులకు గానూ కానుకల రూపంలో భక్తులు రూ.9,09,746 మేర సమర్పించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్ పాల్గొన్నారు.